క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



తెనాలిఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి నాయకులు శుక్రవారం కమిషనర్ ఎం.జశ్వంతరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు షేక్ హుస్సేన్‌వలి, మంగళగిరి వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 7న కార్మికులు విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పద్మావతి, డి.సురేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.

మురుగు పోయే విధంగా చూడండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో నీరు పారుదల అయ్యే విధంగా చూడాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబుతో కలిసి ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించారు. మురుగు కాల్వలను బాగు చేయించడంతో పాటు ఆయిల్ బాల్స్ వేయించారు. ఆమె వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణంలో రికార్డులు తప్పని సరి



కొల్లిపర: ఎరువుల దుకాణాలు నిర్వహిస్తున్న యాజమాన్యం తప్పని సరిగా ఎరువులకు సంబంధించిన రికార్డులు పూర్తిస్థాయిలో వారివద్ద ఉండాలని ఏఓ కె.వెంకటరావు సూచించారు. శుక్రవారం స్థానిక కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(మన గ్రోమోర్ సెంటర్)లో ఎరువులు, రికార్డులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌పి జింక్, బోరాన్(గ్రోప్లస్) చెందిన ఎరువులు సంబంధించి బిల్లులో ఉన్న బ్యాచ్ నెంబర్లకి భౌతికంగా ఉన్న బస్తాల బ్యాచ్ నంబర్లుకి తేడా గుర్తించడం జరిగిందన్నారు. ఎరువుల నియంత్రణ చట్టం 1985 ను ఉల్లంఘించిన కారణంగా గ్రోమోర్ సెంటర్‌ను వారం రోజుల పాటు ఎరువుల లైసెన్స్ సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. యాజమాన్యానికి లైసెన్స్ సస్పెండ్ లెటర్ అందజేశారు.

విద్యార్థినులకు శానిటరి న్యాప్‌కిన్స్ పంపిణీ



తెనాలిఅర్బన్: అమెరికాకు చెందిన చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం శానిటరి న్యాప్‌కిన్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పద్మజ, స్కూల్ హెచ్ఎం శాంతకుమారి, డాక్టర్ కాలారి శ్రీదేవి, డాక్టర్ నిర్మల, ఆవుల శైలజ, కాలారి అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో వ్యవసాయ సలహా మండలి సమావేశం



తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురు-2, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించారు. తెనాలి ఏడిఏ ఎస్ ఉషారాణి మండలవ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్‌లు రైతులతో మాట్లాడారు.ఏడిఏ మాట్లాడుతూ ఆర్బీకేల్లో రైతులకు సరిపడా ఎరువులు ఉన్నాయని , కాంప్లెక్స్ ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.వెద పద్ధతిలో వరి సాగు గురించి రైతులకు వివరించారు.గ్రామ వ్యవసాయసహాయకులు సాయి దీపిక , ప్రజ్ఞాన్‌బాబు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శివకుమార్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయాని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం కొల్లిపర గ్రామంలో సచివాలయం 3 పరిధిలో మూడవ రోజు ఎస్సీ కాలనీల్లో లూథరన్ చర్చి వద్ద నుంచి జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని 250 ఇళ్లను సందర్శించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన సమయంలో ఆకుటుంబం మూడేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే వివరించి సంక్షేమ కర పత్రాలు అందజేశారు.

ఈ మూడేళ్లలో ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి ఇంట్లో ఉన్న వారికి చెబుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరల అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలను దోపిడీ చేసి తెలుగు తమ్ముళ్లకు పంచిపెట్టడం తప్ప సామాన్య, నిరుపేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. బాబు పాలనలో పథకాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. నేడు జగనన్న అర్హత ఉన్న వారికి ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా పథకాలను అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీల్లో నివాసం ఉంటున్న ప్రజలు మాట్లాడుతూ డ్రైనేజీ, సీసీ రోడ్లు కావాలని కోరారు, దీంతో ఆయన మాట్లాడుతూ రానున్న రోజులల్లో డ్రైనేజీ, అవసరమైనచోట సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తొలుత ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నావాళులర్పించారు.అనంతరం లూథర్ చర్చిలో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక , ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ లు చిలువూరి ఝాన్సీ , కె.శ్రీలత ,ఉన్నం నాని, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, పిల్లి ప్రసన్న , తుమాటి వసంతరావు,తుమాటి లక్ష్మి , కొల్లిపర నరేష్ , ఎంపీడీఓ చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది ,వలంటీరులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ



35వ వార్డులో పౌష్టికాహారాన్ని అందుకున్న వారితో కౌన్సిలర్ హరేరామ్



21వ వార్డులో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ సౌజన్య

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించారు. 13,35వ వార్డుల్లో కౌన్సిలర్‌లు కుర్రా సుజాత, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, 21వ వార్డులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె సౌజన్యలు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు కుర్రా సుజాత, గొడవర్తి శ్రీసాయిహరేరామ్‌లు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిచేందుకు ప్రభుత్వం దీనిని నిర్వహిస్తోందని చెప్పారు. అందరు వీటిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న పిల్లల్లో నులిపురుగులు లేకుండా చూడాలి



జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లక్ష్మిసుధ, ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: చిన్న పిల్లల్లో నులిపురుగులు లేకుండా ప్రతి తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకుంటూ సంవత్సర కాలంలో సూమారు మూడు సార్లు ఆల్బెండజోలె ట్యాబ్‌లెట్‌ను వాడాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ భీమవరపు పద్మావతి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 10వ తారీకున ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రాథమిక పాఠశాలలో ఉన్న చిన్నారులకు ఆల్బెండజోలె ట్యాబ్‌లెట్ ను వైద్య సిబ్బంది స్వయంగా చిన్నారులకు అందించి మింగించాలని తెలిపారు. పాఠశాలలో పిల్లలకు పరిశుభ్రత పై అవగాహన పెంచాలని సూచించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణా కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక , ఎంపీడీఓ చంద్రమోహన్, ఎంఈఓ1 సాల్మన్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్‌కు తాళాలు వేసిన కౌలు రైతులు



వలివేరు(వేమూరు): ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ఆదేశించినా.. బ్యాంకర్లు ఇవ్వడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ సిబ్బంది కౌలు రుణాలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆగ్రహించిన రైతులు శుక్రవారం బ్యాంక్‌కు తాళాలు వేసి, నిరసన వ్యక్తం చేశారు. అధిక వర్షాలకు వెద సాగు దెబ్బతిందని, నారు లేక నాట్లు కూడా వేయలేదని కౌలు రైతులు చెప్పుకొచ్చారు. కౌలు గుర్తింపు కార్డులపై రుణాలు ఇస్తే పంటలు సాగు చేసుకుంటామని చెప్పారు. బ్యాంక్ మేనేజరు తమకు రుణాల మంజూరు చేసేందుకు సహకరించక పోవడంతో తాళాలు వేశామని కౌలు రైతులు చెప్పారు.

సుబ్బారావుకు జీవిత సాఫల్య పురస్కారం



నెక్కంటి సుబ్బారావును సత్కరిస్తున్న ప్రాణాధార సంస్థ సభ్యులు

బాపట్ల అర్బన్: చెరువు జమ్ములపాలెం గ్రామంలో శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామస్థుడు నెక్కంటి సుబ్బారావును గ్రామస్తులు, ప్రాణాధార సంస్థ ఆధ్వర్యంలో జీవిత సాఫల్య పురస్కారం అందజేసి, ఘనంగా సత్కరించారు. ప్రణాధార సంస్థ అధ్యక్షుడు కుర్ర పుండరీకాక్షులు మాట్లాడుతూ ధాన్ పండిట్ పురస్కార్ గ్రహీత నెక్కంటి సుబ్బారావు శాస్త్రవేత్తలు చేయలేనిది, రైతుగా సాధించారన్నారు. దేశ ఆహార భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న అన్నదాత, ఆహార స్థిరత్వానికి దోహదపడే రైతు శాస్త్రవేత్తగా విదేశీ మీడియా నుంచి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. దేశం ఆహార భద్రత కొరత నివారణకు నిరంతరం కృషి చేస్తున్న ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధరరావు, నెక్కంటి కిరణ్ ప్రకాష్, నూతలపాటి బాబు, ఆకుల సాంబశివరావు, గూడూరుబాబు, కుర్రా నాగేశ్వరరావు, డాక్టర్ అశోక్‌కుమార్, కాపు అంకమ్మ, వివిధ జిల్లాల రైతులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ, డాక్టర్ సాహిత్య

బాపట్ల అర్బన్ : జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చెరువు జమ్ములపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్ వెస్లీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జమ్ములపాలెం వెటర్నరీ డాక్టర్ ఎస్.సాహిత్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ ప్రతినిధులను అభినందించారు. దాతలు బొద్దుకూరి దానరాజ్, శ్యామసుందరి సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జోగి శ్యామసుందరి, వెటర్నరీ అసిస్టెంట్ కటికల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చుండూరులో మృతవీరుల సంస్మరణ

తెనాలి: మండల కేంద్రమైన చుండూరులో ఈనెల 6వ తేదీన చుండూరు మృతవీరుల సంస్మరణ దినం జరుగుతుందని చుండూరు దళిత బాధితుల కమిటీ అధ్యక్షుడు జాలాది మోజెస్, ప్రధాన కార్యదర్శి దేవరపల్లి వీరయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. సమతా సైనికదళ్‌కు చెందిన కార్యకర్తలు, వివిధ ప్రాంతాల్నుంచి దళిత సంఘాల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, కళాకారులు, మానవతావాదులు హాజరవుతున్నట్లు తెలిపారు. దళిత మృతవీరులకు నివాళులర్పించే కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

రేపు మహమ్మద్ రఫీ సంగీత విభావరి

తెనాలి: అమరగాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా ఈనెల 6వ తేదీన ×రఫీ సాబ్‌కే గానె¤ పేరుతో సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె.పురుషోత్తమరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళా క్షేత్రంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి జరిగే ఈ సంగీత విభావరిలో హైదరాబాద్, జిల్లాకు చెందిన ప్రముఖ గాయనీగాయకులు రఫీ పాటలను గానం చేస్తారని, సంగీతాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సత్యనారాయణస్వామికి ఊంజలసేవ



తెనాలి: స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి ఊంజలసేవను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఊంజల సేవను అర్చకులు చక్రవర్తి నిర్వహించారు. గాయని కొండపి వసుంధర నేతృత్వంలో భక్తులు అందె రాజేశ్వరి, కనకదుర్గ, సీహెచ్ నాగమల్లేశ్వరి, రత్నకుమారి, చిరంజీవి, నరసింహ భక్తిగానాలాపన చేశారు. తబలపై వంశీకృష్ణ, కీబోర్డుపై ఉమామహేశ్వరరావు సహకారం అందించారు. కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శుక్రవారం సాయంత్రం 6–8 గంటల మధ్య జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఇసుక లారీ బోల్తా

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి కొండవీటి వాగు అమరావతి కరకట్ట వెంబడి శుక్రవారం ఉదయం ఓ అరటి తోటలో ఇసుక లారీ బోల్తా పడింది. శుక్రవారం తెల్లవారుజామున అమరావతి కరకట్ట మీద నుంచి అతివేగంగా కొండవీటి వాగు రహదారిలోకి లారీ వస్తుండగా పంప్‌హౌస్ వద్ద గల మలుపులో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అదుపు తప్పి ఇసుక లారీ అరటితోటలో బోల్తా పడింది. అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పూలకు వెళ్లే రైతులు చెబుతున్నారు. లారీ అరటితోటలలో పడడంతో సుమారు 30 చోట్ల వరకు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

9 నుంచి 'నా భూమి -నా దేశం'

చెరుకుపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నా భూమి –నా దేశం, నేల తల్లికి నమస్కారం –వీరులకు వందనం వంటి కార్యక్రమాలను అన్ని గ్రామ పంచాయతీలలో విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో ఐదు రోజుల పాటు అమర వీరుల శిలాఫలకాలు, పంచప్రాణ ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, స్వాతంత్ర్య సమర యోధులను గౌరవించడం, జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతం ఆలపించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అందుకు ఆయా పంచాయతీ కార్యదర్శులు 9వ తేదీ నాటికి సిబ్బందితో చర్చించుకుని ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈవోపీఆర్డీ మురళీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు యాజలి పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం :ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా యాజలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విజయవాడ సెంటినీ హాస్పిటల్స్ వైద్య బృందం గుండె, మెదడు, వెన్నెముక, నరాలు, ఎముకలు, జీర్ణకోశ సమస్యలు, మూత్ర పిండాల వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేస్తారని తెలిపారు.

రాష్ట్రంలోని రైతులను ఆదుకోవాలి

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: రాష్ట్రంలోని రైతులు అనేక కష్టాలు పడుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 5.70 లక్షల ఎకరాలు సాగులోకి రావాలంటే 243 పనులు చేయాలని అధికారులు గతంలో అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. కానీ వేసవి కాలంలో వాటిని చేయకపోవడం వల్ల నేటికి పలు పంట కాల్వలలోని తూటి కాడ, గుర్రపు డెక్కలు అలాగే ఉన్నాయన్నారు. కనీసం లాకులు, వాటిగేట్లు, వాల్స్ మరమ్మతులుచేయలేదని విమర్శించారు. దీనివల్ల అకాల వర్షాలు, వరదలు వస్తే లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాల విభజన జరిగే సమయంలో తెనాలికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం కావడానికి కావాల్సిన అన్ని అర్హతలున్న, పాలకులు ఆదిశగా ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. తెనాలిలోని తాలుకా జూనియర్ కళాశాలకు ఎంతో పేరు ప్రతిష్టలున్నాయని తెలిపారు. అది ప్రస్తుతం మూసివేయటం బాధాకరమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి పూర్వవైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు హరికృష్ణ, హరిదాసు గౌరిశంకర్, లీల, తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలక అంటువ్యాధులపై అవగాహన



కళ్ల కలక వ్యాధిపై విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ సుబ్బారావు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కళ్లకలక అంటువ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.వి.సుబ్బారావు మాట్లాడుతూ కండ్లకలక అంటువ్యాధి ఒకరి నుంచి ఒకరికి త్వరగా వ్యాపిస్తోంది. కంటికి ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించి సలహాల మీద చుక్కల మందు కంటికి వాడాలన్నారు. కండ్లకలక తగ్గేవరకు స్కూల్‌కు రాకుండా ఉండుట మంచిదని, ఇతరులకు వ్యాపించకుండా ఉంటుందన్నారు. పీహెచ్‌సి ద్వారా ప్రతి గురువారం ఐరన్ మాత్రలు ఇస్తున్నామని , విద్యార్థులందరూ వాడాలని , రక్తహీనతకు రోజుకు రెండు మాత్రలు తీసుకోవాలన్నారు. ఆగస్టు10వ తేదీన నులిపురుగుల నివార ణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని, విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. సదస్సులో ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గాంధీ మళ్లీ వస్తే' లఘుచిత్రం చిత్రీకరణ ప్రారంభం



బాపట్ల: బాపట్ల వీఆర్ క్రియేషన్స్ సమర్పణలో 'గాంధీ మళ్లీ వస్తే' లఘుచిత్రం చిత్రీకరణను బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు శుక్రవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా గాంధీ ఆశయ సాధనలో భాగంగా లఘుచిత్రం నిర్మించటం గొప్ప విషయమన్నారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ బాపట్ల పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతుందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున లఘు చిత్రం విడుదల చేస్తామని వెల్లడించారు. చిత్రానికి రచన వెంకు సనాతని అందించగా, గాంధీ పాత్రలో శివశంకర్ నటించనున్నారు . ఈ కార్యక్రమంలో చిత్ర బృంద సభ్యులు భ్రమర, మౌనిక, ఆదం షఫీ, సయ్యద్ పీర్, ఏడుకొండలు, బాషా, సురేష్, కృష్ణ, క్రిష్ణ కిషోర్, సాయికిరణ్, వినోద్, వెంకట్, శ్రీహరి పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

50 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

బాపట్లటౌన్: సారా బట్టీలపై సెబ్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. మండలంలోని స్టువర్టుపురం పెద గ్యాంగ్ పరిధిలో దేవర ప్రియాంక నాటుసారా తయారుచేస్తుండగా సమాచారం తెలుసుకున్న సెబ్ అధికారులు దాడి చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు సారా తయారీకి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. దాడి చేసిన వారిలో సెబ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రభుదాస్ ఉన్నారు.

కొల్లూరులో 10 వేల ఓటర్ల జాబితా తనిఖీ



కొల్లూరులో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కొల్లూరు: ఓటర్ల జాబితా సవరణ నిర్ణీత గడువులోపు పూర్తి చేయడానికి బీఎల్‌ఓలు కృషి చేయాలని తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వేను ఆయన పరిశీలించారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి చిరునామాలో ఉన్న ఓటర్ల వివరాలు క్షుణంగా పరిశీలించి, తప్పుల సవరణ, ఓటర్ల బదిలీ, చేర్పులు చేపట్టాలన్నారు. ఇందులో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా వ్యవహరించాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఓటర్ల జాబితా సవరణ సర్వే ప్రారంభించిన పది రోజుల వ్యవధిలో బీఎల్‌ఓలు మండలంలో 4,663 గృహాలను సందర్శించి 10, 361 ఓటర్ల వివరాలను తనిఖీ చేసినట్లు తహసీల్దారు వెల్లడించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

భట్టిపోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, నాగవల్లీ దళాలతో విశేష అర్చన, అఖండ కర్పూర హారతి వంటి కార్యక్రమాలను అర్చకులు భట్టిప్రోలు కార్తికేయ శర్మ శాస్త్రోక్తంగా జరిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో ఆరేపల్లి రాజా, సుబ్బారావు, ప్రభాకర్, నాని దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ, భక్త బృందం నిర్వాహకులు పర్యవేక్షించారు.

డ్రోన్ వచ్చేసింది..

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండలంలో డ్రోన్ల ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దారు డి.కవిత శుక్రవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని కేర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు క్రీడా ప్రాంగణం నుంచి డ్రోన్ సర్వేను పర్యవేక్షించారు. అక్కడి నుంచి డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వేకు మండలాన్ని మొత్తం 9 భాగాలుగా విభజించడం జరిగిందన్నారు. పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, అల్లూరు రెవెన్యూ గ్రామాలను 35 స్క్వేరు కిలోమీటర్లు 8 వేల ఎకరాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం మూడు రోజుల్లో సర్వే పూర్తి కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ అమానుల్లాఖాన్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.